సాక్షి ఖమ్మం

ఆదివారం। 3। ఆగస్టు। 2025

● కల్మషం లేనిదే స్నేహం

స్నేహం అంటే ఏమిటి? అన్న ప్రశ్నకు 73 మంది కల్మషం లేనిది.. అని బదులిచ్చారు. అవసరాలు తీర్చేదే స్నేహం అని కేవలం 27 మంది మాత్రమే చెప్పారు. నిజమైన స్నేహానికి ఆర్థికపరమైన లావాదేవీలు, స్వార్థపూరితమైన ఆలోచనలు అడ్డు రావని ఇది స్పష్టం చేస్తోంది.

● కలుషితం కాలేదు..

ఫ్రెండ్‌షిప్ ఇప్పుడు కలుషితమైందా? అన్న ప్రశ్నకు 82 మంది 'లేదు' అని గట్టిగా బదులిచ్చారు. స్నేహం పవిత్రత ఏ మాత్రం చెక్కుచెదర లేదని.. కలుషితం కాలేదని వారి మాటలు తేల్చిచెప్పాయి. ఇదే సమయంలో 18 మంది మాత్రం కొందరి వల్ల స్నేహం కలుషితమవుతోందనే భావన వ్యక్తం చేశారు.

● నా నిజమైన స్నేహితులు

నీకు ఎందరు నిజమైన స్నేహితులు ఉన్నారు? అన్న ప్రశ్నకు 70 మంది ఇద్దరికి మించి ఉన్నారని బదులిచ్చారు. ఎక్కువ మంది స్నేహితులు ఉండడమే అంత ఆనందానికి కారణమని తెలిపారు. ఇక మరో 30మంది నిజమైన స్నేహితులు ఒక్కరే ఉన్నారని వెల్లడించారు.



స్నేహం.. అత్యంత స్వచ్ఛమైన బంధం. రక్తం పంచుకుని పుట్టకపోయినా అంతకు మించిన అనుబంధం స్నేహితుల మధ్యే ఉంటుంది. నేడు(ఆదివారం) స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఖమ్మం, పాల్వంచలో 'సాక్షి' ఆధ్వర్యాన నిర్వహించిన సర్వేలో ఈ మాటలు అక్షర సత్యమని రుజువైంది. కష్టాల్లో తోడుగా ఉండే వారే నిజమైన స్నేహితులు కాగా.. అవసరాల కోసం వచ్చివెళ్లే వారు కాదని ఎక్కువ మంది ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. రెండు చోట్లా కలిపి 100 మంది(50 మంది పురుషులు, 50 మంది మహిళలు)ను సర్వే చేయగా... హృదయాలను తాకేలా అభిప్రాయాలు వెల్లడించారు.

– ఖమ్మంమయూరిసెంటర్/పాల్వంచ

- స్నేహితుల విలువ శాశ్వతం
- అన్నీ పంచుకునే విలువైన వ్యక్తులు మిత్రులే..


నేడు స్నేహితుల దినోత్సవం

స్నేహం.. అనంతం



● అమ్మా నాన్న తర్వాతే..

స్నేహితులకు ఇచ్చే స్థానంపై ఆరా తీయగా.. 34 మంది అమ్మ, నాన్న తర్వాత స్నేహితుల స్థానంగా చెప్పారు. మరో 53 మంది నాన్న, అమ్మ తర్వాత ఫ్రెండ్‌కు స్థానం కల్పించారు. ఇంకొక 13 మంది స్నేహితుల తర్వాతే అమ్మనాన్నకు స్థానం ఇచ్చారు. ఈ సమాధానాల ఆధారంగా కుటుంబ సభ్యుల తర్వాతే స్నేహితులకు ప్రాధాన్యత ఇచ్చినట్లయింది. తద్వారా ప్రస్తుత తరం వారు తల్లిదండ్రులతోనూ స్నేహితుల మాదిరే ఉంటున్నారని తేటతెల్లమైంది.



స్నేహితులతోనే అన్నీ పంచుకుంటాం..



తల్లిదండ్రుల తర్వాత కష్టసుఖాలు, ఆనందాలు పంచుకునేది స్నేహితులతోనే. తల్లిదండ్రులతో పాటు స్నేహితులు కూడా కుటుంబీకులే. అన్ని దినుసులు వేస్తేనే మంచి వంటకం తయారైనట్లు మంచి స్నేహితులు ఉంటే మన జీవితం కూడా రుచికరమైన వంటలా ఉంటుంది.

– వి.హనీష, వార్డు ఆఫీసర్, కేఎంసీ

స్నేహితులు లేని జీవితం లేదు..



స్నేహితులు లేని జీవితం ఉండదు. చిన్ననాటి నుంచి స్నేహితులతో గడిపిన క్షణాలు ఎన్నటికీ మరిచిపోలేం. రక్త సంబంధీకులతో సైతం పంచుకోలేని విషయాలు స్నేహితులమంతా ఒకరికి ఒకరం చెప్పుకుంటాం. కష్టాలు, సంతోషాల్లో నాతో నడిచిన స్నేహితులు చాలా మంది ఉన్నారు.

– జి.ప్రసాద్, ఖమ్మం

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ముదిగొండ: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ముదిగొండ మండలంలో పర్యటించనున్నారు. కమలాపురంలో రూ.10 కోట్ల నిధులతో నిర్మించే గిడ్డంగి, కమలాపురం, పెద్ద మండవ, వల్లభి, ముదిగొండల్లో రూ.10 కోట్ల నిధులతో నిర్మించే సీసీ రోడ్లకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

మంత్రి పొంగులేటి..

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఖమ్మం చేరుకోనున్న ఆయన రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం, వేంసూరు మండలం అడసర్లపాడు, సత్తుపల్లిలో జరిగే ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరవుతారు. సాయంత్రం 5 గంటలకు తిరుమలాయపాలెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి.. లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారు. అలాగే, ఆతర్వాత 6 గంటలకు కొక్కిరేణిలో అభివృద్ధి పనులకు పొంగులేటి శంకుస్థాపన చేయనున్నారు.

శాకాంబరీ రూపంలో అమ్మవార్లు



ఎర్రుపాలెం: జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూల విరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని స్వామివారి పాదానికి పంచామృతంతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను శాకాంబరీదేవి రూపంలో అలంకరించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే, స్వామి, అమ్మవార్ల కల్యాణం, పల్లకీ సేవ నిర్వహించారు. కాగా, ఆదివారం నుంచి 5వ తేదీ వరకు ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ కె.జగన్మోహన్‌రావు తెలిపారు. వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఎర్రుపాలెం: భూసమస్యలపై అందిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఎరుపాలెం తహసీల్‌ను శనివారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించాక భూసంబంధిత సమస్యలపై ఆరా తీశారు. అలాగే, ములుగుమాడులో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూముల రీసర్వే, రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల పరిశీలన, భూభారతి పోర్టల్‌పై తహసీల్దార్ ఎం.ఉషాశారదతో చర్చించి సూచనలు చేశారు. ఆర్‌ఐ రవి, సర్వేయర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

వైరారూరల్: పొలంబాట ద్వారా రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సంబంధిత సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామని ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిపారు. వైరా మండలం దాచాపురంలో శనివారం నిర్వహించిన పొలం బాటలో ఆయన పాల్గొన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర సమస్యలు తెలుసుకోవడంతో పాటు విద్యుత్ మోటార్లకు కెపాసిటర్ల ఏర్పాటుతో లాభాలను వివరించారు. ఏడీఏ కిరణ్‌కుమార్, ఏఈ వెంకటసాయి, లైన్‌మెన్ పాషా పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా విడుదల

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. ఈమేరకు స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించనుండగా శనివారం సీనియారిటీ జాబితాతో పాటు గ్రేడ్–2 హెచ్‌ఎం ఖాళీలను ప్రకటించారు. జిల్లాలో 2,859 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉండగా 2,503 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో పదోన్నతులకు 260మందిని అర్హులుగా గుర్తించారు. కాగా, సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి పరిశీలించాక తుదిజాబితా విడుదల చేయనున్న అధికారులు ధ్రువపత్రాల పరిశీలన అనంతరం పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేస్తారు.

బాలల జీవితాల్లో వెలుగులు

- అనాథ పిల్లలకు గుర్తింపు కార్డుల జారీ
- జనన ధ్రువీకరణ, ఆధార్, ఎఫ్ఎస్‌సీ, ఆరోగ్యశ్రీ కార్డులు కూడా..
- కలెక్టర్ చొరవతో 81 మంది పిల్లలకు లబ్ధి



ఖమ్మం బాలల సదనంలోని చిన్నారులు

ఖమ్మంమయూరిసెంటర్: కుటుంబీకులు ఎవరో తెలియక... చిరునామా లేకుండా జిల్లాలోని బాలల సదనం, అనాథ శరణాలయాల్లో ఉండడమే కాక ఉనికిని నిరూపించుకోలేని అసహాయత.. ప్రభుత్వ ఆసరాకు దూరంగా జీవిస్తున్న బాలల జీవితాల్లో వెలుగురేఖలు ప్రసరించే సమయం ఆసన్నమైంది. జిల్లా యంత్రాంగం తీసుకున్న మానవీయ నిర్ణయం వారి బతుకులకు కొత్త అర్థాన్ని ఇవ్వనుంది. అనాథ బాలలందరికీ జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, ఫుడ్ సెక్యూరిటీ కార్డులే కాక ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేసే బృహత్తర కార్యక్రమానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శ్రీకారం చుట్టారు. దీన్ని పరిపాలనా ప్రక్రియగా కాక చిన్నారుల జీవితాలకు గౌరవప్రదమైన పునరుజ్జీవనంగా అధికారులు చెబుతున్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో జిల్లాలోని 81 మంది అనాథ బాలలకు గుర్తింపు లభించనుంది.

నిరాశ నుండి నూతన ఆశకు..

సమాజంలో గుర్తింపు లేకపోవడం ఎంతటి వేదనో అనుభవించిన వారికే తెలుస్తుంది. అనాథ బాలలు అలాంటి వేదనను నిత్యం అనుభవించారు. పాఠశాల మెట్లు ఎక్కాలన్నా, అనారోగ్యానికి గురైతే వైద్యం పొందాలన్నా నువ్వెవరు.. అన్న ప్రశ్న ఎదురయ్యేది. ఆధార్ కార్డు కూడా లేని కారణంగా వారికి కేటాయించిన హక్కులు, అవకాశాలు దక్కలేదు. ప్రతీ చిన్న అవసరానికి ఆటంకాలు ఎదురవుతుండడం లేత మనస్సులపై ప్రభావం చూపించింది. కంటి నిండా కలలు ఉన్నా, సాకారం చేసుకునేందుకు కనీస మార్గం లేకపోవడాన్ని గ్రహించిన కలెక్టర్ అనుదీప్ మానవతా దృక్పథంతో బాలలకు సరైన దారి చూపాలని నిర్ణయించారు.

జిల్లాలో అనాథ బాలల వివరాలు..	
బాలల సదనం	55
అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ, ఖమ్మం	15
శాంతి నిలయం, బోనకల్	11
మొత్తం	81

భవిష్యత్‌కు భరోసా..

చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. జిల్లాలోని ప్రభుత్వ బాలల సదనంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అనాథశరణాలయాల్లో ఉన్న చిన్నారులకు గుర్తింపు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఈమేరకు 81 మందికి ఎలాంటి గుర్తింపు లేదని తెలుసుకున్న అధికారులు కలెక్టర్ ఆదేశాలతో ఐడీ కార్డుల జారీకి శ్రీకారం చుట్టారు. తొలుత జనన ధృవీకరణ పత్రం(ఆర్‌డీఓ ప్రొసీడింగ్స్ ద్వారా) ఇప్పించారు. ఆ పత్రం ఆధారంగా ఆధార్ కార్డు, అందులోని చిరునామా ఆధారంగా ఫుడ్ సెక్యూరిటీ కార్డు జారీ చేశారు. అంతేకాక ఆరోగ్యశ్రీ కార్డుకు దరఖాస్తు చేయడంతో అందరి లాగే ఆ చిన్నారులకు గుర్తింపుతో పాటు భవిష్యత్‌పై భరోసా లభిస్తోంది. అంతేకాక వారిలో ఆత్మవిశ్వాసం, ఆశలను.. సమాజంలో తమకంటూ ఒక స్థానం ఉందని గుర్తించే భరోసాను కల్పించినట్లయింది. కాగా, ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా ఉచితంగా రూ.10 లక్షల వరకు వైద్యసేవలు పొందనుండడం విశేషం.

గర్వంగా ఉంది..



అధికారులు మాకు గుర్తింపు కార్డులు ఇస్తుండడం ఆనందంగానే కాక గర్వంగా ఉంది. ఇప్పటి వరకు ఆధార్, బర్త్ సర్టిఫికెట్లు లేవు. మాకు ఆధార్ కార్డు కావాలన్న కల కలెక్టర్ సార్ చొరవతో నెరవేరింది. సమాజంలో మాకూ ఓ గుర్తింపు దక్కడం చెప్పలేనంత ఆనందంగా ఉంది.

– మరియా, ఖమ్మం

మేమంతా సంతోషిస్తున్నాం..



ఇన్ని రోజులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు లేకుండానే జీవిస్తున్నాం. ఇప్పుడు అధికారులు మాకు ఈ గుర్తింపు కార్డులన్నీ ఇస్తున్నారని తెలిసి మేమంతా సంతోషిస్తున్నాం. మాలో చాలా మందికి కార్డులు లేక ఇబ్బంది అవుతుందనే ఆందోళన ఇకపై తొలగిపోయినట్లే.

– కావ్య, ఖమ్మం

కలెక్టర్ చొరవతో కార్డులు..



జిల్లాలోని అనాథ బాలలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని కలెక్టర్ నిర్ణయించారు. దీంతో బాలల సదనంతో పాటు ఇతర శరణాలయాల్లో ఉంటున్న 81 మంది చిన్నారులకు డేటాఫ్ బర్త్, ఆధార్ గుర్తింపు కార్డులు ఆపై రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులను మంజూరు చేయించాం.

– కె.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి

చిన్నారులు ఉన్నతస్థాయికి ఎదగాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంమయూరిసెంటర్: బాలల సదనంలో ఉన్న పిల్లలు జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకాంక్షించారు. ఖమ్మంలోని బాల సదనంను శనివారం సందర్శించిన ఆయన అభివృద్ధి పనులపై సూచనలు చేశారు. శిశుగృహలో ఏడాది నిండిన చిన్నారితో కేక్ కట్ చేయించారు. అనంతరం బాలల సదనంలోని చిన్నారులకు జారీ అయిన ఆరోగ్యశ్రీ కార్డులను అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతరాణితో కలిసి అందజేశారు. పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వడంతో అనారోగ్యం ఎదురైతే రూ.10లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందుతుందని తెలిపారు. బాలల సదనంలోని పిల్లలకు ఇస్రో కేంద్రం సందర్శనకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, డీసీపీఓ విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు

పీఎం కిసాన్ నిధులు విడుదల

1.04లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.20.89 కోట్లు

ఖమ్మంవ్యవసాయం: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం 20వ విడత నగదు శనివారం రైతుల ఖాతాల్లో జమ అయింది. జిల్లాలో 1,04,455 మంది రైతుల ఖాతాల్లో రూ.2వేల చొప్పున రూ.20,89,10,000 జమ అయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. సన్న, చిన్నకారు రైతులకు పంటల పెట్టుబడి సాయం కింద ఏటా కేంద్రప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద రూ.6వేలు మూడు విడతలుగా చెల్లిస్తోంది. ప్రస్తుతం జమ అయిన నగదు వానాకాలం పంటల సాగు అవసరాలకు ఉపయోగపడనుంది.

పెట్టుబడి అవసరాలకు..

వైరా: పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం ద్వారా అందే సాయం రైతులకు పంట పెట్టుబడి అవసరాలకు ఉపయోగపడుతుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి.పుల్లయ్య, మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రాంప్రసాద్ తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ ద్వారా రైతుల ఖాతాల్లోకి నగదు బదిలీ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వైరా కేవీకే నుంచి శనివారం వారు రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం పత్తి, వరి, పెసర పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, అధిక సాంద్రత విధానంలో పత్తి సాగుతో లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మయాన్ మంజుఖాన్, కేవీకే ఇన్‌చార్జి కోఆర్డినేటర్ టి.పావని, శాస్త్రవేత్తలు చైతన్య, పీఎస్ఎం.ఫణిశ్రీ, శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన మాజీ ఎమ్మెల్యే సండ్ర, నాయకులు

వైరా/తల్లాడ: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్ సూచించారు. వైరా, తల్లాడ మండలం నారాయణపురంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై విసుగు చెందిన ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈమేరకు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని చెప్పారు. అయితే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమల్లోకి వచ్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లోనూ అత్యధిక సీట్లు సాధించేలా బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవితో పాటు నాయకులు కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, భూమాత కృష్ణమూర్తి, కాపా మురళీకృష్ణ మాదినేని సునీత, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దొడ్డా శ్రీనివాసరావు, దుగ్గిదేవర వెంకట్‌లాల్, ముప్పా మురళి, బద్దం కోటిరెడ్డి, పెరికె నాగేశ్వరరావు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కటికి నరసింహారావు, రఘు, కేతినేని చలపతిరావు, అయిలూరి ప్రదీప్‌రెడ్డి, తూము శ్రీనువాసరావు పాల్గొన్నారు.

■ **ఖమ్మం మామిళ్లగూడెం:** ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో 88మందికి మంజూరైన రూ.22 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అందజేసి మాట్లాడారు. నాయకులు సామినేని హరిప్రసాద్, బెల్లం వేణు, అజ్మీరా వీరునాయక్, బాషబోయిన వీరన్న, కనగాల వెంకటరావు, వాచేపల్లి లక్ష్మారెడ్డి, ఉప్పల వెంకటరమణ, బిచ్చాల తిరుమలరావు, కర్నాటి కృష్ణ, రుద్రగాని శ్రీదేవి, పోట్ల శీను, లకావత్ గిరిబాబు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, బంక మల్లయ్య, బలుసు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో మంచి ఫలితాలు

వైరా: పంటల్లో సంప్రదాయ గుళికల యూరియాకు బదులు నానో యూరియా వాడడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరంలో నానో యూరియా, నానో డీఏపీపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అవసరం మేరకే యూరియా వాడడం ద్వారా భూసారాన్ని సంరక్షిస్తూ ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. ఏఓ మయాన్ మంజుఖాన్, ఏఈఓ మేడా రాజేష్, రైతులు పాల్గొన్నారు.

■ **ఖమ్మంవ్యవసాయం:** రైతులు నానో యూరియా వినియోగానికి అలవాటు పడుతున్నారని డీఏఓ పుల్లయ్య తెలిపారు. ఖమ్మంలోని ఫర్టిలైజర్ షాప్‌లను ఏఓ కిశోర్‌బాబుతో కలిసి తనిఖీ చేశాక మాట్లాడారు. నానో యూరియాతో లాభాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ పుల్లయ్య

క్లుప్తంగా

జాతీయ సదస్సులో ఖమ్మం న్యాయవాది



సదస్సులో జనార్దన్, న్యాయవాదులు

ఖమ్మంలీగల్: కాంగ్రెస్ లీగల్ సెల్ జాతీయ కమిటీ ఆధ్వర్యాన ఢిల్లీలో శనివారం రాజ్యాంగ పరిరక్షణ న్యాయవాద సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్, ఖమ్మంకు చెందిన సింగం జనార్దన్ పాల్గొన్నారు. 150 మంది న్యాయవాదులు పాల్గొనగా పలు అంశాలపై చర్చించినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

లాలాపురం వాసికి డాక్టరేట్



ఇమ్మడి శ్రీనివాస్

కొణిజర్ల: మండలంలోని లాలాపురం గ్రామానికి చెందిన ఇమ్మడి శ్రీనివాస్‌కు తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. శ్రీనివాస్ ఎంఏ, ఎంఫిల్ పూర్తిచేశాక అన్నామలై యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ విల్లయికరసి పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ప్రస్తుతం ఆయన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలి



రిజిస్టర్లు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మం అర్బన్: ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని ఆర్‌టీఐ కమిషనర్ పీ.వీ.శ్రీనివాసరావు సూచించారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు అందిన దరఖాస్తులు, పరిష్కారంపై ఆరా తీశాక జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల పాటు ఆర్‌టీఐ కమిషనర్ నియామకం లేక వేలాది కేసులు పేరుకుపోయినందున త్వరగా పరిష్కరించేలా జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. కాగా, ప్రతీ ప్రభుత్వ కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టం బాధ్యుల వివరాలు, ఫోన్ నంబర్లతో బోర్డులు ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. అలాగే, ఖమ్మం ఇందిరానగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన సమాచార హక్కు చట్టం కమిషనర్ శ్రీనివాసరావు విద్యార్థులతో మాట్లాడడంతో పాటు వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేమంతా ఉన్నాం..

నీ కోసం నేనున్నా అనే ఆత్మీయ స్పర్శే స్నేహం. నిరాశ, నిస్పృహలు చుట్టుముట్టినా, భరించలేని కష్టం ఎదురైనా అండగా నిలబడే వారే స్నేహితులు. ప్రతిఫలంగా హితం కోరే వారిని నిజమైన స్నేహితులుగా భావిస్తారు. అలాంటి స్నేహం ఏళ్లు గడిచినా, స్థాయి మారినా కొనసాగితేనే ఆనందం! పలువురు తమ బృందంలోని వారికి సుఖాల్లోనే కాక కష్టాల్లోనూ తోడుగా నిలుస్తూ స్నేహబంధాన్ని చాటుతున్నారు. ఇంకొందరు స్నేహితులు బృందాలుగా ఏర్పడి ఆపదలో ఉన్న వారికి చేయూతనిస్తున్నారు. నేడు (ఆదివారం) అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా అలాంటి బృందాల్లో కొందరి కథనాలు.



- స్నేహం.. ఓ మాధుర్యం
- ఏళ్లు గడిచినా, స్థాయి పెరిగినా తగ్గని మైత్రి
- కష్టసుఖాల్లో అండగా నిలుస్తున్న మిత్రులు

నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం

స్నేహంతో పాటు సమాజహితం



అంధ విద్యార్థులకు నిత్యావసరాలను అందిస్తున్న మిత్ర బృందం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మానికి చెందిన తూములూరి లక్ష్మీనరసింహారావు, పెనుగొండ శ్రీనివాసరావు, పల్లా లింగయ్య, బజ్జూరి రమణారెడ్డి, సోమారపు సుధీర్‌కుమార్, సూరినేటి మల్లేశం, దేవరశెట్టి రామారావు, పెనుగొండ సాయికుమార్, మోతుకూరి భద్రయ్య, ఎంఎస్.పుల్లారావు, జి.సూర్యనారాయణ, జంగిలి రమణ, మిట్టపల్లి రాధాకృష్ణ తదితరుల మధ్య ముప్పై ఏళ్లుగా స్నేహం కొనసాగుతోంది. జ్యోతి నివాసంలో ఉంటున్న అంధ, మూగ, చెవిటి విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం హైస్కూల్ విద్యార్థులకు నోట్ బుక్స్, పరీక్ష సామగ్రి, అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీటి ఫిల్టర్లు అందించగా.. ఓ షాప్‌లో గుమస్తా హరిప్రసాద్ ఇద్దరు కూతుళ్ల చదువులకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. ఏటా వేసవిలో హర్కారా బావి సెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేసే ఈ బృందం సభ్యులు... కరోనా సమయాన ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సహాయకులకు నిత్యం భోజనం సమకూర్చారు.

యాభై ఏళ్ల స్నేహం



విహారయాత్రలో మిత్రులు (ఫైల్)

మధిర: మధిర లడకబజార్‌కు చెందిన చెరుపల్లి శ్రీహరి, రావిరాల శశికుమార్, కాలం యుగంధర్, చెరుపల్లి శ్రీధర్, కంచి కృష్ణ, ఆలా ఆరోగ్య వరప్రసాద్, కోడెం రమణ, ఎస్.కే. యూనిస్, పాసికంటి రవి, కుడుముల శ్రీనివాసరావు మధ్య 50 ఏళ్ల కిందట ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. ఇందులో ఐదేళ్ల కిందట కుడుముల శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి అంతా అండగా నిలవడమే కాక ఆయన పేరిట ఏటా పేదలకు అన్నదానం చేస్తున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వీరు తరచుగా కలుసుకోవడమే కాక ఎవరి ఇళ్లల్లో ఏ కార్యక్రమం జరిగినా సమష్టిగా బాధ్యతలు పంచుకుంటారు. అంతేకాక ఏటా విహారయాత్రలకు వెళ్తున్నారు.

డిగ్రీ స్నేహం.. చెదరని బంధం



కుటుంబ సభ్యులతో శివలింగం, శ్రీనివాస్, త్రివేణి, సత్యనారాయణ (ఎడమ నుండి కుడికి)

ఖమ్మంమయూరిసెంటర్: పాతికేళ్ల కిందట పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొదలైన స్నేహం నేటికీ కొనసాగుతోంది. 1998–2001లో డిగ్రీ చదివిన జె.శివలింగం, శ్రీనివాసరావు, సత్యనారాయణ, త్రివేణి మధ్య ఏర్పడిన స్నేహం ఎక్కడా ఆగిపోలేదు. డిగ్రీ తర్వాత జె.శివలింగం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అకౌంట్స్ ఆఫీసర్‌గా, సత్యనారాయణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా, శ్రీనివాసరావు ఫార్మా రంగంలో, త్రివేణి ఉపాధ్యాయురాలిగా స్థిరపడ్డారు. కానీ, స్నేహం అలాగే ఉండటం, నలుగురి కుటుంబాలూ కలిసి ఆనందాల్లో పాలుపంచుకుంటూ, కష్టాల్లో అండగా నిలుస్తూ ముందుకు సాగుతున్నారు.

సేవలో మేటి.. యువ భారత్‌శక్తి



యువభారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు

సత్తుపల్లిటౌన్: ఇంటర్, బీటెక్ కలిసి చదువుకున్న తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల వారు స్నేహబంధాన్ని కొనసాగిస్తూ యువభారత్ శక్తిగా ఏర్పడ్డారు. సత్తుపల్లికి చెందిన కామెర క్రాంతి, గౌస్‌పాషా, శబరినాథ్ కలిసి 2014 నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆపై 2018లో యువభారత్‌శక్తి ఫౌండేషన్‌ను ఏర్పాటుచేసి వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం ద్వారా ఎవరికి ఆపద ఉందని తెలిసినా అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు రూ.కోటి మేర సహాయం అందించడం విశేషం. ఉమ్మడి జిల్లాలో 46 రక్తదాన శిబిరాల ద్వారా 5 వేల మందికి రక్తదానం చేశారు. జిల్లాలోని 24 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.1.50 లక్షల విలువైన బ్యాగ్‌లు, కరోనా సమయంలో 60 రోజుల పాటు యాచకులు, వృద్ధులకు భోజనంతో పాటు వేయికి పైగా కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 2020లో రూ.11.35 లక్షలు, 2021లో రూ.13.82 లక్షలు 2022లో రూ.15.59 లక్షలు, 2023లో రూ.15.48 లక్షలు, 2024లో రూ.12.69 లక్షలు, ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.7 లక్షల మేర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం అందించారు. కాగా, సేవాకార్యక్రమాలకు గాను పలు ఫౌండేషన్ల ద్వారా 'యువభారత్ శక్తి'కి పురస్కారాలు లభించాయి.

స్నేహితులే నా బలం..



12 ఏళ్లుగా నిర్విరామంగా స్నేహితుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సోషల్ మీడియా వేదికగా ఆర్థిక సాయం సేకరించి అవసరమైన వారికి అందిస్తున్నాం. పది మందితో మొదలైన ఫౌండేషన్ ప్రస్తుతం 4 వేల మంది సభ్యులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

–కామెర క్రాంతి, యువభారత్‌శక్తి ఫౌండేషన్ ఫౌండర్

మిత్ర ఫౌండేషన్ ఆపన్న హస్తం



టెన్త్ టాపర్‌కు గత కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందజేస్తున్న బృందం

ఖమ్మంగాంధీచౌక్: ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది మిత్ర ఫౌండేషన్. వ్యాపారం, వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడిన ఖమ్మానికి చెందిన ఈ బృందం సభ్యులు సామాజిక సేవ, చైతన్యం కోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. గోదావరి, మున్నేటి వరదల సమయాన ముంపు ప్రాంతాల ప్రజలకు రూ.10 లక్షల విలువైన నిత్యావసరాలు అందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏటా సైకిళ్లు, బుక్స్, బ్యాగులు అందిస్తున్నారు. గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.3 లక్షల విలువైన బహుమతులు ఇవ్వడమే కాక టాపర్లు ఐదుగురికి విమానంలో ఢిల్లీ యాత్రకు తీసుకువెళ్లారు. కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మిత్ర ఫౌండేషన్‌లో రంగా శ్రీనివాస్, పాలవరపు శ్రీనివాస్, చారుగుండ్ల రవికుమార్, చెరుకూరి యుగంధర్, నాగసాయి గ్యాస్ నగేశ్ తదితరులు సభ్యులుగా ఉన్నారు.

ఒకరికొకరుగా పూర్వవిద్యార్థులు



వేణు పిల్లల పేరిట ఎఫ్‌డీలు అందజేస్తున్న స్నేహితులు

ముదిగొండ: ఒకరి కోసం మరొకరు అన్నట్లుగా ఈ స్నేహబంధం కొనసాగుతోంది. ఏటా ఓ వేదికపై కలుస్తూ ఆ సంవత్సరం చేయాల్సిన మంచి పనులు నిర్ణయించుకుని ముందుకు సాగుతున్నారు. మండలంలోని బాణాపురం పాఠశాలలో ఒకటి నుంచి పదోతరగతి వరకు (2005–06 బ్యాచ్) చదివిన పూర్వ విద్యార్థులు సంఘంగా ఏర్పడ్డారు. ఈ బృందంలో 45 మంది ఉండగా.. 2023 నుంచి ఎవరికి ఏం జరిగినా సమాచారం ఇచ్చిపుచ్చుకుంటూ చేయూతనిస్తున్నారు. 2023లో ఏన్కూరు వద్ద రోడ్డు ప్రమాదంలో ఈ బృందానికి చెందిన వేణు మృతి చెందగా ఆయన ఇద్దరు కుమార్తెల పేరిట రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. 2024లో మరో స్నేహితురాలి భర్త అనారోగ్యంతో బాధపడుతుంటే చికిత్సకు రూ.40 వేలు అందించి ఆదుకున్నారు. మరో కుటుంబానికి రూ.13 వేల నిత్యావసర సరుకులు అందించగా.. ఇంకో స్నేహితుడు మృతి చెందగా రూ.40 వేలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.

అండగా అందరం..



కలిసి చదువుకున్న మేం ఏటా సమావేశమై మంచీచెడు చర్చించుకుంటాం. వృత్తి, వ్యాపారాలు, కుటుంబ వ్యవహారాలు, ఆర్థిక ఇబ్బందులు, శుభకార్యాలపై మాట్లాడుకుంటాం. అలాగే, మా బ్యాచ్‌కు సంబంధించిన ఎవరికి ఆపద వచ్చినా అంతా కలిసి అండగా నిలుస్తున్నాం.

–బెందు లక్ష్మణ్, బాణాపురం

కలిసికట్టుగా.. తోడునీడగా



ఎక్కడ పనిచేస్తున్నా.. ఎంత దూరంలో ఉన్నా మా బృందంలో ఎవరికైనా సమస్య ఎదురైందంటే వెంటనే వచ్చేస్తాం. శుభకార్యాలకు బహుమతులు ఇవ్వడమే కాక ఇబ్బందుల్లో ఉన్న వారిని అండగా నిలుస్తున్నాం. అందరం కలసికట్టుగా, తోడునీడగా కొనసాగుతున్నాం.

–దీకొండ వెంకటేశ్, బాణాపురం

పది ట్రాక్టర్ల ఇసుక సీజ్

తిరుమలాయపాలెం/చింతకాని: తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో అక్రమంగా నిల్వ చేసిన పది ట్రాక్టర్ల ఇసుకను టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ రఘు ఆధ్వర్యాన పోలీసులు శనివారం సీజ్ చేశారు. గ్రామానికి చెందిన తాత మనోజ్ అనుమతి లేకుండా ఇసుక నిల్వ చేశాడనే సమాచారంతో సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అలాగే, చింతకాని మండలం చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం జగన్నాథపురం సమీపాన సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

కాంగ్రెస్‌లో కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు



మాట్లాడుతున్న వినయ్, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపునిచ్చేందుకే రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ (ఆర్‌జీపీఆర్‌ఎస్)ను ఏర్పాటు చేసినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఆర్‌జీపీఆర్‌ఎస్ నిర్వాహకులు గంటా వినయ్ తెలిపారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆర్‌జీపీఆర్‌ఎస్‌పై పార్టీ శ్రేణులతో చర్చించాక వారు విలేకరులతో మాట్లాడారు. ఎవరైతే కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడ్డారో వారిని కొత్తతరం నాయకులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కష్టపడిన వారికి కచ్చితంగా గుర్తింపు లభిస్తుందని, ఇందుకోసం గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో ఆర్‌జీపీఆర్‌ఎస్ ద్వారా పరిశీలన ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, నాయకులు దొబ్బల సౌజన్య, మహ్మద్ జావీద్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి రెనాల్ట్ 'న్యూ ట్రైబర్'



నూతన మోడల్ కారుతో జీఎం, చైర్మన్ తదితరులు

ఖమ్మంఅర్బన్: రెనాల్ట్ కంపెనీ కొత్తగా రూపొందించిన న్యూ ట్రైబర్ ఫేస్‌లిఫ్ట్ మోడల్ కారును ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఖమ్మంలోని ఆర్కా రెనాల్ట్ షోరూంలో ఈ కారును శనివారం జీఎం వెంకటేశ్వరరావు ఆవిష్కరించాక మాట్లాడారు. మధ్యతరగతి కుటుంబాలకు తగినట్లు డిజైన్‌తో పాటు భద్రత, సౌకర్యాలు ఈ కారులో ఉన్నాయని తెలిపారు. భారత్ గ్రూప్ చైర్మన్ కేసా సుబాష్‌చంద్రబోస్, రెనాల్ట్ సేల్స్ హెడ్ ఓం నవీన్‌కాంత్, స్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చికిత్స కోసం వైద్యశాల

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షేమ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చికిత్స కోసం ప్రత్యేక వైద్యశాల (ఇన్ఫర్మరీ రూమ్)ను ఏర్పాటు చేశారు. ఈ గదిని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి స్కూల్ చైర్‌పర్సన్ నిష్ఠాశర్మ శనివారం ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులకు చిన్న గాయాలు, ఆకస్మిక అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు చికిత్స అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్‌ఐ కామరాజు, డాక్టర్ వేణుమాధవ్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే శిశువు మొదటి టీకా

ఖమ్మంఅర్బన్: బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వడం ద్వారా శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్ రమణ తెలిపారు. మంచుకొండ పీహెచ్‌సీ పరిధి బాలాజీనగర్, పాండురంగాపురం, బల్లేపల్లి, ప్రశాంతినగర్‌లో శనివారం ఆయన తల్లిపాల వారోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనడమే కాక వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిశువులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూనే గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సిన్లు వేయాలని సిబ్బందికి సూచించారు. ఏఎన్‌ఎంలు రమాదేవి, భారతమ్మ, రాధ, ప్రమీల, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాల్లో అలసత్వం వీడాలి

తిరుమలాయపాలెం: మండలంలో డెంగీ కేసుల తీవ్రత దృష్ట్యా పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. మండలంలోని అజ్మీరాతండాలో శనివారం పర్యటించిన ఆమె పారిశుద్ధ్య పనులను పరిశీలించాక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, పన్నుల వసూళ్లు, ఓటర్ల జాబితా తయారీపై సూచనలు చేశారు. డీఎల్‌పీఓ టి.రాంబాబు, ఎంపీడీఓ ఎస్.కే.సిలార్ సాహెబ్, ఎంపీఓ పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మార్చురీలో భద్రపరిచిన మృతదేహం

ఖమ్మంవైద్యవిభాగం: మతిస్థిమితం లేని, గుర్తుతెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. ఆ వ్యక్తి ఖమ్మం రస్తోగినగర్ వద్ద పడిఉండగా.. అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే సదరు వ్యక్తి మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని ఖమ్మం టూటౌన్ పోలీసులు కోరారు.

యువకుడి ఆత్మహత్య



కూరపాటి రాజేశ్ (ఫైల్)

పెనుబల్లి: తల్లి అనారోగ్యానికి తోడు అప్పులు పెరుగుతుండడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కొత్తకారాయిగూడెంకు చెందిన కూరపాటి రాజేశ్ (22) తల్లి కేన్సర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతో నాలుగు నెలలుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతోంది. రాజేశ్ గ్రామంలో కరెంట్ పని చేస్తూ తల్లి వైద్యఖర్చులకు అప్పులు చేస్తున్నాడు. అయినా తల్లి ఆరోగ్యం మెరుగవక, అప్పులు పెరగడంతో మనస్తాపానికి గురై శనివారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై ఆయన తండ్రి సీతారాములు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వీఎం.బంజర ఎస్‌ఐ కె.వెంకటేశ్ తెలిపారు.